ప్రజా విశ్వంభర V3 NEWS

నా జీవితంలో మర్చిపోలేని క్షణమిది..



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, నటి చిత్రాంగద సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'మాతృభూమి'. అపూర్వ లఖియా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంపై ఆడియన్స్‌లో మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలోని 'మదిరాపన్' పాట షూటింగ్‌కు సంబంధించిన బిహైండ్-ది-సీన్స్ వీడియోతో చిత్రాంగద సింగ్ తాజాగా ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. సెట్‌లో తనకు ఎదురైన అనుభవాలు, టీమ్ ఇచ్చిన సహకారం గురించి ఆమె ఈ పోస్ట్‌లో పంచుకున్నారు. సినిమా షూటింగ్ సమయంలో తనకు గాయమైన విషయాన్ని చిత్రాంగద చెప్పారు. ఆ గాయం, ఆ తర్వాత సెట్‌లో జరిగిన మస్తీ, మొత్తం టీమ్ ఇచ్చిన సపోర్ట్ తనకు ఎప్పటికీ మర్చిపోలేని క్షణాలుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ముఖ్యంగా తనను ఈ పరిస్థితి నుంచి బయటకు తీసుకొచ్చి, అండగా నిలిచిన దర్శకుడు అపూర్వ లఖియా, కొరియోగ్రాఫర్ ముదస్సర్ ఖాన్, అలాగే సల్మాన్ ఖాన్‌కు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.'మదిరాపన్' పాటకు హిమేశ్ రేషమ్మియా సంగీతం అందించగా, ముదస్సర్ ఖాన్ కొరియోగ్రఫీ చేశారు. సమీర్ అంజాన్ ఈ పాటకు సాహిత్యం అందించారు. కాగా.. 2020లో భారత, చైనా సైనికుల మధ్య జరిగిన గల్వాన్ లోయ ఘర్షణల ఆధారంగా ఈ వార్ డ్రామాను రూపొందించారు. ఇందులో సల్మాన్ ఖాన్ పవర్‌ఫుల్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో అనూప్ బిక్రమ్ షాహి, అంకుర్ భాటియా, ప్రశాంత్ తమంగ్ కీలక పాత్రల్లో నటించారు. హిమేశ్ రేషమ్మియా సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఎలాంటి కట్స్ లేకుండా ఖ/ఆ సర్టిఫికెట్ జారీ చేసింది. ఇక పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా, ఫైనల్‌గా డిసెంబర్ 4న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతోంది.

నటించే విషయంలో హద్దులు పెట్టుకోవడం మానను



నటి శ్రుతిహాసన్ కొత్త కబురు వినిపించారు. హారర్ థ్రిల్లర్ చిత్రం 'అశ్విన్స్'తో గుర్తింపు తెచ్చుకున్న తరుణ్ తేజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. శాంతి టాకీస్ సంస్థ దీన్ని నిర్మించనుంది. ఈ సినిమాని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ఓ కొత్త జానర్‌ని టచ్ చేస్తూ.. ఓ విభిన్నమైన కథాంశంతో ఈ సినిమా రూపొందనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

మెప్పించాలని ప్రయత్నించే వ్యక్తిని కాదు!..

తనను మొండి మనిషి అని ముద్ర వేసినా ఫర్వాలేదు కానీ, నటించే విషయంలో హద్దులు పెట్టుకోవడం మాననని అన్నారు శ్రుతి హాసన్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె 'పెద్ది' చిత్రంలో చేసిన ప్రత్యేక గీతంతోపాటు, సినిమాల్లో నటీమణులను చిత్రీకరించే తీరుపై వస్తున్న విమర్శల గురించి అడిగిన ప్రశ్నలకు స్పందించారు. "నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం. అందంగా రెడీ అవ్వడం ఇష్టం. ఈ విషయంలో నా వైఖరి నాదే. నేనెప్పుడూ.. ఏ విధంగానూ ఇతరులను మెప్పించాలని ప్రయత్నించలేదు. నాకు ఏదైనా డ్రెస్ సౌకర్యంగా అనిపించకపోతే వేసుకోనని వెంటనే చెప్పేస్తాను. ఒక వేళ చేశానంటే నాకు అది సౌకర్యంగా ఉందీ అనే అర్థం.ఈ విషయంలోనన్నుకొందరు మొండిదానివి అని కూడా అన్నారు. అయినా ఫర్వాలేదు.నేను ఇతర మహిళల అనుభవం గురించి మాట్లాడలేను. ఎనిమిదేళ్ల కిందట అయితే ఆ సినిమా గురించి ఇంత సంభాషణ ఉండేది కాదు.ఇప్పుడు అలాంటి చర్చల్లో వ స్తున్న మార్పు సంతోషంగా అనిపిస్తుంద"న్నారు శ్రుతి.

కౌంట్‌డౌన్ మొదలైంది



చిత్రబృందం కౌంట్‌డౌన్ మొదలుపెట్టింది. నాగార్జున అక్కినేని కథానాయకుడిగా... రా.కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమే 'కింగ్ 100'. టబు, అశోక్ సెల్వన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని చేసుకొంటోంది. త్వరలోనే ప్రచార కార్యక్రమాల్ని మొదలు పెట్టనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. మంగళవారం చిత్రబృందం ఓ ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. డిసెంబరు 24న ప్రేక్షకుల ముం దుకు రానున్న ఈ సినిమాకి ఛాయాగ్రహణం: రాజా మహదేవన్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, కూర్పు: నవీ న్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: సతీశ్ కుమార్.ఎన్.

ఎమ్మీ పురస్కారాల్లో భారతీయ సిరీస్‌లకు నిరాశ



ప్రతిష్ఠాత్మక 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల పోటీలో నామినేషన్ వరకు వెళ్లిన భారతీయ సిరీస్‌లకు నిరాశ ఎదురైంది. ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఈ వేడుకలో భారత్ తరఫున ఉత్తమ కామెడీ సిరీస్ విభాగంలో నామినేట్ అయిన స్టాండప్ కామెడీ సిరీస్ 'వీర్ దాస్: ఫుల్ వాల్యూమ్' అవార్డును గెలుచుకోలేకపోయింది. అర్జెంటీనాకు చెందిన 'డివిజన్ పలెర్మో – సీజన్ 2' సిరీస్ ఈ అవార్డును సొంతం చేసుకుంది. అలానే 'రియల్ కశ్మీర్ ఫుట్‌బాల్ క్లబ్' ఉత్తమ డ్రామా సిరీస్ విభాగం లో నామినేషన్ వరకు వెళ్లగా ఫ్రెంచ్ హిస్టారికల్ డ్రామా 'కారెమె' అవార్డును దక్కించుకుంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ఎమ్మీలో రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు. ప్రజెంటర్‌గా నటి ఆండ్రియాతో కలిసి ఉత్తమ టీవీ మూవీ/మినీ సిరీస్ అవార్డును అందించారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వంగా ఉందని ఆయన చెప్పారు.

అందరూ మెచ్చేలా 'నాన్న కుట్టి'



విజయ్ ఆంటోని, ప్రీతి అస్రాని ప్రధాన పాత్రల్లో ము.మారన్ తెరకెక్కించిన చిత్రం 'నాన్న కుట్టి'. ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మించారు. లిథాన్య కీలక పాత్ర పోషించారు. రామాంజనేయులు జవ్వాజీ సహ నిర్మాత. ఈ సినిమా ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో విజయ్ ఆంటోని మాట్లాడుతూ.. "ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. ద్వితీయార్ధం భావోద్వేగభరితంగా ఉంటుంది. లిథాన్య పాత్రతో అందరూ కనెక్ట్ అవుతారు. ఈ సినిమా తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు. దర్శకుడు ము.మారన్ మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో అన్ని రకాల అంశాలు ఉంటాయి. తండ్రీ – కూతుళ్ల అనుబంధాన్ని అద్భుతంగా చూపించాం" అన్నారు. ఈ కార్యక్రమంలో కౌశిక్, లారా విజయ్ ఆంటోని, భాష్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాదైన ముద్ర కంటే కథే ముఖ్యం



"సినిమాలో హింసని దర్శకుడో లేదంటే ఫైట్ మాస్టరో బలవంతంగా క్రియేట్ చేస్తే ప్రేక్షకులు చూడరు. అదే కథ కోరుకుంటే మాత్రం అది హింస అనే విషయం కూడా గుర్తుకు రాదు. మా సినిమాలో మోతాదుకు మించిన హింస ఉన్నట్టు అనిపించొచ్చు కానీ, అదంతా భావోద్వేగాల్లో భాగంగానే ఉంటుంది" అన్నారు సంపత్ నంది. ఇటీవల ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'భోగి'. శర్వానంద్ కథానాయకుడు. ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదల కానున్న సందర్భంగా సంపత్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"సంక్రాంతికి ముందు భోగికీ ఈ సినిమాకీ సంబంధం లేదు. ఒక చెడుని, ఓ పాత విషయాన్ని పాతరేసిన తర్వాత వచ్చే భోగి ఇది. ఆ లెక్కన సంక్రాంతికి ముందు వచ్చే భోగి ఉద్దేశం కూడా అదే. మనం పాత విషయాలు, పాత వస్తువుల్ని తగలబెట్టడమే కదా భోగి ఉద్దేశం. ఓ ఊరు కొన్ని విషయాల్ని నమ్మింది, ఆ నమ్మకం సరైంది కాదని నిరూపించిన ఓ యువకుడి చుట్టూ ఈ కథ సాగుతుంది. నా చిన్ననాటి జ్ఞాపకాలే ఈ కథకు ప్రేరణ. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఓ సంఘటన ఆధారంగా బొగ్గుల గుట్ట అనే ఓ కల్పిత గ్రామాన్ని సృష్టించి రూపొందించిన చిత్రమిది. 1960లనాటి వాతావరణం, సంస్కృతి, అప్పటి ప్రేమలు, ప్రతీకారాలతో తెరకెక్కించాం. ఇప్పటివరకూ కుటుంబ కథలు చేసిన శర్వానంద్... ఉన్నట్టుండి ఓ యాక్షన్ సినిమా చేసేసరికి ఆ లుక్, ఆయన మాట్లాడే ప్రతి మాట, ప్రతి స్పందన కొత్తగా అనిపించాయి". "వీలైనంతవరకూ నా శైలి నుంచి కొంచెం పక్కకు జరిగి, ఓ కొత్త విధానంలో కథ చెప్పే ప్రయత్నం చేశా. నాదైన ముద్రని ప్రదర్శించడం కంటే కూడా, కథ చెప్పడం ముఖ్యమని భావించి దానిపైనే దృష్టిపెట్టి చేసిన సినిమా ఇది. సెన్సార్ కోసం రివైజింగ్ కమిటీ వరకూ వెళ్లడానికి కారణం కథలోని అంశమే. రివైజింగ్ కమిటీ ఈ సినిమా చూసి ఏ సర్టిఫికెట్ ఇచ్చింది".

తొలిసారి చూశాక నిన్నే.. మునిగాను నీ మాయలోనే



త్రినాథ్ వర్మ, నిర్మల్, శ్రియా కొంతం ప్రధాన పాత్రధారులుగా రుద్ర అత్రి తెరకెక్కించిన చిత్రం 'పాకెట్ రాకెట్స్'. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మాక్సిమం సిటీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. జేడీ చక్రవర్తి, శ్రీనివాస్ అవసరాల తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా డిసెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "తొలిసారి చూశాక నిన్నే.. మునిగాను నీ మాయలోనే" అంటూ సాగిన ఈ ఇల్యూషన్ పాటకు గ్యానీ స్వరాలు సమకూర్చడమే గాక స్వయంగా ఆలపించారు. రమేశ్ కుమార్ సాహిత్యమం దించారు. "ఇది గ్యాంబ్లింగ్ చుట్టూ తిరిగే ఆసక్తికర కథాంశంతో రూపొందిన సినిమా. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల పోటీలో రామాయణం



రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'రామాయణం'. నితేశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్ర మొదటి భాగం ఇటీవల విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. తాజాగా క్రిటిక్స్ ఛాయిస్ అసోసియేషన్(సీసీఏ) 32వ క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల షార్ట్‌లిస్ట్‌ని ప్రకటించింది. ఇందులో 'రామాయణం' ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్, ఉత్తమ స్టంట్ డిజైన్ విభాగాల్లో చోటు సంపాదించుకుంది. 'ది ఒడిస్సీ', 'డ్యూన్: పార్ట్ 3', 'గాడ్జిల్లా మైనస్ జీరో' లాంటి పలు అంతర్జాతీయ చిత్రాలతో ఈ సినిమా పోటీ పడనుంది. డిసెంబరు 4న నామినేట్ అయిన చిత్రాల జాబితా విడుదల కానుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com